https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 91 శుక్రవారం 7-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# ఔటర్ నిర్వహణ బాలేదు

## కాంట్రాక్టర్ కంపెనీపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం


**అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి**
**భూసేకరణ, రుణాలు, నిర్వహణ దానికిందే..**
**ప్రభుత్వం సేకరించిన భూములకే టీడీఆర్**
**టీడీఆర్ బాండ్లపై ప్రత్యేక కమిటీ వేయాలి**
**ఫ్యూచర్‌సిటీ రోడ్డు డిసెంబరు 9కి పూర్తవ్వాలి**
**రోడ్ల నిర్మాణంపై సమీక్షలో సీఎం ఆదేశాలు**



**హైదరాబాద్, ఆగస్టు 6**
రాష్ట్ర ప్రగతికి కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ ఏ మాత్రం బాగోలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా ఉన్నారని సీఎం మండిపడ్డారు. ఓఆర్ఆర్ నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గురువారం ముఖ్యమంత్రి ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య రోడ్ల అభివృద్ధి గురించి హెచ్ఎండీఏ, హెచ్ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు, ఈ రెండింటికీ అనుసంధానంగా కొత్తగా నిర్మించే రేడియల్ రోడ్లు... వీటన్నింటినీ ఒకే వ్యవస్థ కిందకు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. భూసేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణను కూడా ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. అప్పుడే సమన్వయం తేలికవుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు టీడీఆర్ బాండ్ల పైన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తన అవసరం మేరకు సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. అంతేతప్ప ప్రభుత్వానికి అవసరం లేకున్నా ఎవరైనా ముందుకొచ్చి భూములిస్తాం అంటే టీడీఆర్‌లు ఇవ్వొద్దని తేల్చిచెప్పారు. ప్రభుత్వ అవసరార్థం తీసుకునే వాటికే టీడీఆర్‌లు వర్తిస్తాయని స్పష్టత ఇచ్చారు. టీడీఆర్ ప్రక్రియను మొత్తం ఆన్లైన్ చెయ్యాలని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా వ్యవస్థను రూపొందించాలని చెప్పారు.

# జెన్-జీ దేశ వ్యతిరేకులు కాదు

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్..



ముంబై: జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో నిర్వహించిన ఐఐఎమ్‌యూఎన్ సమావేశంలో మోహన్ భాగవత్ పాల్గొన్నారు. అనంతరం జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. తమ కాలంలో పెద్దల మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారమని, అయితే నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. అయితే నిరసనలు చేపట్టేందుకు ప్రజాస్వామ్యంలో కొన్ని పద్ధతులు, నియమాలు ఉంటాయని యువత గుర్తించాలని సూచించారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ చెప్పారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా వందకు పైగా నగరాల నుంచి దాదాపు 2 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.

# పంద్రాగస్టున స్మార్ట్ రేషన్ కార్డులు!

**1.05 కోట్ల కుటుంబాలకు పంపిణీ**
**సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్**
**అదేరోజు 119 నియోజకవర్గాల్లో అందజేత**
**డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ తరహాలో రూపకల్పన**
**పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని**
**అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, ఆగస్టు 6**
రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత కార్డు లబ్ధిదారులకు సర్కారు 'స్మార్ట్ రేషన్ కార్డులు' ఇవ్వనుంది. ఈ మేరకు 1.05 కోట్ల కుటుంబాలకు ఆగస్టు 15న కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రేషన్ లబ్ధిదారులకు ప్రత్యేకంగా కార్డులంటూ ఏమీ ఇవ్వలేదు. గత లబ్ధిదారులు, కొత్తగా ఎంపికైన లబ్ధిదారులు ఆహార భద్రత కార్డులను ఆన్‌లైన్ ద్వారా జిరాక్స్ తీసుకొని, లామినేట్ చేసి దాన్నే కార్డుగా వినియోగిస్తున్నారు. తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. పాత, కొత్త రేషన్ కార్డుదారులందరికీ కూడా స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పలు నమూనాలను పరిశీలించి.. కార్డుల డిజైన్ పూర్తి చేసింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఆర్సీ, డెబిట్, క్రెడిట్ కార్డుల తరహాలోనే స్మార్ట్ రేషన్ కార్డులను తయారు చేయించింది. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభిస్తారు. సంప్రదాయం ప్రకారం.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున సాయంత్రం లోక్ భవన్‌లో 'ఎట్ హోం' నిర్వహిస్తారు. సాయంత్రం 5:30కు జరిగే ఈ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు.

# పరామర్శల పేరుతో జగన్ విధ్వంసం: సీఎం

- **గంజాయి బ్యాచ్‌నూ జెన్‌జీగా చెప్పుకోవడం ఆ పార్టీకే చెల్లు**
- **అసూయతోనే డీఎస్సీపై యాగీ**
- **ఏడాది తర్వాత ధర్నాలు చేయడమేంటి?**
- **కోర్టుల్లో 300 పైచిలుకు కేసులు వేసింది**
- **వాటిని కొట్టేసి చీవాట్లు పెట్టినా తీరు మారదు**
- **నాడు 'దిశ' పేరుతో ప్రజలను మభ్యపెట్టారు**
- **ఉత్తుత్తి పోలీసు స్టేషన్లతో హంగామా**
- **క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో చర్చ**



**అమరావతి, ఆగస్టు 6**
గంజాయి బ్యాచ్‌ను వెంటేసుకుని తిరుగుతూ.. వారిని జెన్‌జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ పరామర్శల పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారని, దేవరపల్లి పర్యటనలో అడవి పందులు పొలాల్ని నాశనం చేసినట్లు గొడ్డలి పార్టీ నేతలు చిరువ్యాపారుల దుకాణాలను, పొగాకు రైతుల కష్టాన్ని ధ్వంసం చేశారని విమర్శించారు. రాజకీయ పార్టీ ముసుగులో.. క్రిమినల్స్ తయారీ అడ్డాగా గొడ్డలి పార్టీ మారిందన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం క్యాబినెట్ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ అనంతరం సీఎం సహచర మంత్రులతో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా జగన్ పరామర్శ యాత్రలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# చేనేత ఉత్పత్తులను కొనండి

## ప్రధాని మోదీ పిలుపు




**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**
జాతీయ చేనేత దినోత్సవం(ఆగస్టు 7) సందర్భంగా చేనేత ఉత్పత్తులను కొనాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో సందేశం పోస్టు చేశారు. చేనేత వస్త్రాలు ధరించి భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు చేనేత కార్మికులకు, చిరు వ్యాపారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేలా చిన్న వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు. 1905 ఆగస్టు 7న బ్రిటీషర్లకు వ్యతిరేకంగా భారతీయులు స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారని ఆయన తన వీడియో సందేశంలో తెలిపారు.

# ఏకపక్షంగా తీర్పుఎలా ఇచ్చారు?

- **ఎవరికో నోటీసులు అందితే..**
- **దాన్ని ఎలా పరిగణనలోకి తీసుకుంటారు?**
- **గద్వాల ఎమ్మెల్యే ఎన్నిక విషయంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు అసహనం**
- **మళ్లీ విచారణకు ఆదేశిస్తాం తదుపరి విచారణ 25న**





**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**
నోటీసులు సరైన వ్యక్తికి అందనప్పుడు ఏకపక్షంగా (ఎక్స్‌పార్టే) తీర్పు ఎలా ఇస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నికను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇవ్వడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. మళ్లీ విచారణ చేపట్టాలని హైకోర్టును ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది. 2018లో గద్వాల ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. కృష్ణమోహన్ రెడ్డి సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగా ఉందని, ఆయన ఎన్నికను రద్దు చేసి, తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని కోరుతూ డీకే అరుణ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత.. కృష్ణమోహన్ రెడ్డి ఎన్నిక చెల్లదంటూ 2023 ఆగస్టులో హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎన్నికలో ఆయన తర్వాతి స్థానంలో నిలిచిన డీకే అరుణను 2018 డిసెంబరు 12 నుంచీ ఎమ్మెల్యేగా పరిగణించాలని ఆదేశించింది. తప్పుడు ఎన్నికల అఫిడవిట్ సమర్పించిన కృష్ణమోహన్ రెడ్డికి రూ.2,50,000 జరిమానా విధించింది. హైకోర్టు తీర్పును 2023 ఆగస్టు 31న కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కృష్ణమోహన్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు ఆదిత్యసోంధి, మోహిత్ రావు వాదిస్తూ.. హైకోర్టు జారీ చేసిన నోటీసులు తమ క్లయింట్‌కు కాకుండా బి.అనంతరెడ్డి అనే వ్యక్తికి అందాయని, అయినప్పటికీ హైకోర్టు ఏకపక్షంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఆస్తులను దాచిపెట్టారన్న ఆరోపణలు అర్థరహితమన్నారు. 'ఎన్నికల అఫిడవిట్ దాఖలు చేయడానికి ముందే సంబంధిత భూమిని రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా విక్రయించాం. బ్యాంక్ ఖాతాల్లో కేవలం రూ. 16,000నుంచి రూ.18,000మాత్రమే ఉన్నాయి. ఇతర ప్రతివాదులకు పత్రికల ద్వారా నోటీసులు ఇచ్చిన హైకోర్టు.. కృష్ణమోహన్‌రెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపించింది' అని ఆరోపించారు. డీకే అరుణ తరఫు న్యాయవాది బినా మాధవన్ కలుగజేసుకుంటూ అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకే రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా నోటీసులు వెళ్లాయని తెలిపారు. జనరల్ క్లాజెస్ యాక్ట్ ప్రకారం సరైన చిరునామాకు నోటీసులు పంపినప్పుడు, దాన్ని నోటీసులు అందినట్లుగానే పరిగణించాలని నివేదించారు. అయితే, డీకే అరుణ తరఫు న్యాయవాది వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. 'నోటీసుల అక్నాలెడ్జ్‌మెంట్‌పై ఉన్నది కృష్ణమోహన్‌రెడ్డి సంతకం కానప్పుడు.. అతడికే నోటీసులు అందాయని ఎలా నిర్ధారిస్తారు?అని ప్రశ్నించింది. అక్నాలెడ్జ్‌మెంట్‌పై సంతకం తేడాను గమనించినప్పుడు హైకోర్టు మళ్లీ నో టీసులు ఇచ్చి ఉండాల్సిందని, లేదంటే పత్రికా ముఖంగా ప్రకటన ఇవ్వాల్సిందని అభిప్రాయపడింది. ఈ పరిస్థితుల్లో ఎక్స్‌పార్టే తీర్పును కొట్టివేసి, మళ్లీ విచారణ చేపట్టాలని హైకోర్టును ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది.

## ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి

# సీఎంగా ఉన్నారు

### రేవంత్‌పై హరీశ్ ఫైర్



**సిద్దిపేట, ఆగస్టు 6:**
సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. గోదావరిలో 380 ుటీఎంసీల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. GRMBచరిత్రలోనే అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులను రద్దు చేయాలని, రివ్యూ చేయాలని మొదటిసారి వచ్చిందని అన్నారు. గతంలో 18 వరకు +=వీదీ సమావేశాలు జరిగాయని.. అజెండాలో తెలంగాణ ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని, ప్రాజెక్టులను రద్దు చేయాలని ఎప్పుడూ రాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి GRMB అజెండా మార్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే GRMB మీటింగ్‌ను బహిష్కరించాలని మాజీ మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్‌కు 47 ుటీఎంసీల హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి

# చాటి చెప్పిన మహనీయుడు ప్రొ. జయశంకర్

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్**



**జగిత్యాల, ఆగస్టు 06**
జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆచార్య ప్రొ.కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు జరిగాయి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య ప్రొ. కొత్తపల్లి జయశంకర్ సార్ అని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ మాట్లాడుతూ, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ సార్ అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప విద్యావేత్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ చేతన్ నితిన్, ఐపీఎస్ డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఏఓ శశికళ, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆచార్య ప్రొ. కొత్తపల్లి జయశంకర్ సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# రౌడీ, హిస్టరీ షీటర్ల పై నిరంతర నిఘా ఉంచాలి

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్**

**ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.**

**జగిత్యాల, ఆగస్టు 06**
జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారు పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ, హిస్టరీ, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ, తరుచూ నేరాలకు పాల్పడే వ్యక్తులపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తుల ప్రవర్తన, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశమున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడకుండా వారిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు



# మద్దతు ధరల మర్మం !



రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం

కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది. రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ప్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న


ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిం చడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్య వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు.

# కార్పొరేట్ కులతత్వం




జిలుగువెలుగుల కార్పొరేట్ ప్రపంచం అడుగున కులతత్వం కుళ్లు కంపు కొడుతున్నదా? మడతలు నలగని సూటూబూటూ కింద సంకుచిత కులాధిపత్యం పాకుతున్నదా? లేక వేళ్లూనుకొని కుక్కమూతి పిందెలు వేస్తున్నదా? ఇండిగో సంస్థలో ఓ ఉద్యోగికి ఎదురైన చేదు అనుభవం జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంకా వెనుకబాటుతనం పూర్తిగా మాసిపోని పల్లెటూళ్లలోనో, ఆధిపత్యవాదం రాజ్యమేలే గొప్పగొప్ప విద్యాసంస్థల్లోనో కులతత్వం ఉందంటే నిజమే అనుకోవచ్చు. అందుకు సంబంధించిన వార్తలు మనం తరచుగా వింటూనే ఉంటాం. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల దళిత పెండ్లిళ్లలో వరుడు గుర్రమెక్కి ఊరేగడం ప్రాణాంతకమే. పేరుమోసిన వర్సిటీల్లో దళిత బిడ్డలు వేధింపులు భరించలేక ఉసురు తీసుకునే ఉదంతాలు మన దృష్టికి ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇది నవభారతం మోస్తున్న నిన్నటి శాపం, రేపటి పాపం. ఒక కార్పొరేట్ సంస్థలో 'నువ్వు అధముడివి, విమానాలు నడపడంతో నీకేం పని.. పోయి చెప్పులు కుట్టుకో' అని తోటి ఉద్యోగులు ఓ దళిత బహుజన పైలట్‌ను దారుణంగా అవమానించడం ఏమిటి? చెప్పులు కుట్టే చేతులు విమానాలు నడపొద్దని రాజ్యాంగం ఏమైనా చెప్తున్నదా? భారతదేశానికి కులవివక్ష కొత్త కాదు. కానీ, కార్పొరేట్ తెరమీద అది మరీ ప్రస్ఫుటంగా ప్రత్యక్షం కావడం ఆలోచింపజేస్తున్నది. ఉద్యోగి తన బాస్‌ల మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలైంది. విచారణలో ఏం తేలుతుందనేది వేరే సంగతి. కానీ, ఈ ఘటనతో కార్పొరేట్ ప్రపంచంలో కులతత్వంపైకి అందరి దృష్టి మళ్లింది. ఆర్థిక సరళీకరణల భుజాలపై ఊరేగుతూ ప్రపంచీకరణ దూసుకొస్తున్న రోజుల్లో ప్రపంచం ఓ కుగ్రామంలా మారుతున్నదనే మాట తరచుగా వినిపించేది. అడ్డుగోడలు తొలగిపోతున్నాయన్న భావనలు పురివిప్పుకొన్నాయి. భారత్ అంతకంతకూ విశ్వ ఆర్థికవ్యవస్థతో పెనవేసుకుపోతున్న నేపథ్యంలో మన నేతలు తరచుగా వసుధైవ కుటుంబం అనే భావనను పదేపదే ఉల్లేఖించడం పరిపాటి అయిపోయింది. కానీ, ఆ ఉదాత్త భావనను సాధించడానికి భారత్ ఇంకా చాలాచాలా దూరంలో ఉన్నదని ఇటీవల ఈ గడ్డ మీద జరుగుతున్న సంకుచిత కుల వైషమ్యాలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ జోరులో విస్తరించిన కార్పొరేట్ ప్రపంచంలో కులాతీత, ప్రజ్ఞ ఆధారిత ప్రోత్సాహమే ఉందనేది సాధారణ అవగాహన. కానీ, ఇండిగో ఉదంతం ఇదంతా భ్రమేనని అంటున్నది. కులవ్యవస్థ అనేది శ్రమ విభజన మాత్రమే కాదని, అది శ్రామికుల విభజన అని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ ఇక్కడ గుర్తుకువస్తున్నది. కార్పొరేట్ ఆధిపత్య వ్యవస్థ అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థగా రూపొందేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, ఆ దిశగా నిచ్చెనలు అందుకునేలోగా కులతత్వం పాములు కిందకు ఈడ్చేయకుండా చూసుకోవాలి.

# జలమే మానవాళికి జీవనాధారం



**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వంసం చేయడం, చెరువుల, కాలువను ధ్వంసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్దాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# చేర్యాల కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

## న్యాయవాది మల్లయ్య హత్యను ఖండించిన చేర్యాల బార్ అసోసియేషన్



**చేర్యాల, ఆగస్టు 6 :**

కొల్లాపూర్ కోర్టు పరిధిలోని పెంట్లవెల్లిలో న్యాయవాది శ్రీ మల్లయ్యను అత్యంత దారుణంగా హత్య చేయడం చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీర మల్లయ్య తీవ్రంగా ఖండించారు న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఒక న్యాయవాదిపై ఇంతటి క్రూరమైన ఘటన న్యాయవాదుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అలాగే, మృతుడు మల్లయ్య కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు, ప్రభుత్వ పరంగా తగిన ఆర్థిక సహాయం అందించి, కుటుంబంలోని ఒక అర్హుడైన సభ్యునికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఈ దారుణ హత్యను మరోసారి తీవ్రంగా ఖండిస్తూ, నిందితులపై వేగవంతమైన, నిష్పాక్షిక చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మెరుగు రమేష్ ఉపాధ్యక్షుడు కాటం సురేందర్ సీనియర్ న్యాయవాదులు భూమిగారి మనోహర్ బి యాదగిరి గౌడ్ న్యాయవాదులు పొన్నం సురేష్ నల్గొండ సంతోష్ తాటికొండ ప్రణీత్ నీరటి రాజలింగం గుస్క వెంకటేష్ రామకృష్ణారెడ్డి ఆంజనేయులు దాసరి ప్రశాంత్ దస్తగిరి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ముదిగొండలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శరత్ 'మెరుపు తనిఖీలు'..



**ముదిగొండ, ఆగస్టు 6 :**

ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారి (ఫుడ్ ఇన్‌స్పెక్టర్) శరత్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు హోటళ్లు, స్వీట్ షాపులు, టీ స్టాళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గత కొన్ని రోజులుగా స్థానిక హోటళ్లలో ఆహార నాణ్యత సరిగా ఉండటం లేదని, అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారంటూ ప్రజల నుండి ' అధికారులకు వచ్చిన వరుస ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ ప్రముఖ టీ స్టాల్, హోటల్‌ను పరిశీలించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శరత్.. అక్కడ వాడుతున్న వంట నూనెలు, తయారు చేసి ఉంచిన సమోసాలు, జిలేబీలు, బజ్జీలు వంటి ఇతర ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు వాడినా, నాణ్యత లేని నూనెలను పునర్వినియోగించినా కఠిన చర్యలు ఉంటాయని వ్యాపారులను హెచ్చరించారు. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా విధిగా నెట్లు లేదా మూతలు ఏర్పాటు చేయాలని దుకాణదారులకు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే హోటళ్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శరత్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అధికారులతో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు. (30 ఏళ్లుగా నమ్మకంగా నడుపుతున్నాం – ఓనర్ దుర్గారామ్: ఈ తనిఖీలపై హోటల్ యజమాని దుర్గారామ్ మాట్లాడుతూ.. తాము గత 30 సంవత్సరాలుగా ఎలాంటి ఫిర్యాదులు లేకుండా, అత్యంత శుభ్రంగా ఈ హోటల్‌ను నడుపుతున్నామని తెలిపారు. ఎల్లప్పుడూ తాజా పదార్థాలనే వాడుతామని, అధికారుల తనిఖీలకు సహకరిస్తామని చెప్పారు. కాగా, ఈ పరిసరాల్లోనే ఈ హోటల్ చాలా నీట్‌గా ఉంటుందని, ఇక్కడి ఫుడ్ నాణ్యతపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్థానిక ప్రజలు కూడా ఈ సందర్భంగా యాజమాన్యానికి మద్దతుగా తెలిపారు.)

# ముదిగొండలో నిరంతర పోలీస్ నిఘా

## ప్రశాంతంగా సాగుతున్న సెంట్రల్ డివైడర్, లైటింగ్ రోడ్డు పనులు



**ముదిగొండ ఆగస్టు-6,( ది టైమ్స్ ఆఫ్ తెలంగాణ)**


ఖమ్మం జిల్లా, ముదిగొండ మండల కేంద్రంలో శనివారం నాటి ఉద్రిక్తతల అనంతరం, ప్రస్తుతం శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. గ్రామం మధ్యలో నిలిచిపోయిన ముదిగొండ – వల్లభి రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్ మరియు ఆధునిక స్ట్రీట్ లైటింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేందుకు పోలీసులు నిత్య ప్రతినిత్యం పహారా కాస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిరంతర నిఘారౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్: పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు బృందాలు నిరంతరం గస్తీ (పెట్రోలింగ్) నిర్వహిస్తున్నాయి. పనులకు రక్షణ: రోడ్డు నిర్మాణ యంత్రాలు (జేసీబీలు), కార్మికులకు పూర్తి రక్షణ కల్పిస్తూ పనులు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణ: నిర్మాణ పనుల వల్ల స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తు న్నారు. సమస్య పరిష్కారంపై అధికారుల నిఘాగతంలో బాధితుల నుంచి వ్యక్తమైన ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, శాంతిభద్ర తల సమస్య తలెత్తకుండా రెవెన్యూ మరియు పోలీసు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పోలీసుల కట్టుదిట్ట మైన నిఘా నడుమ ముదిగొండను సుందరంగా తీర్చిదిద్దే ఈ సెంట్రల్ డివైడర్ లైటింగ్ రోడ్డు పనులు ఇప్పుడు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి.



# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై సిపిఐ పోరాటం

## సెప్టెంబర్ 1 న ఛలో జంతర్ మంతర్ (ఢిల్లీ)

**నిజాంపేట్ ఆగస్టు 6 :**



సిపిఐ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా లో భాగంగా సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం నిజాంపేట్ సర్కిల్ వద్ద "బద్లావ్ జరూరి హై" (మార్పు కావాలి) కేంద్ర ప్రభుత్వం అవాలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి 12 సంవత్సరలు దాటినా ఇప్పటికి పేద ప్రజలు, విద్యార్థులు, రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. కనుక సెప్టెంబర్ 1వ తేదీన జంతర్ మంతర్ దగ్గర జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గోని ప్రజా అనుకూల ప్రభుత్వాని ఏర్పాటు చేసుకునే దిశగా మనం ముందుకు పోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఏఐటీయూసీ కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి, వెంకటేష్, యాకన్న, మల్లన్న, కృష్ణ, యదన్న, నర్సమ్మ, సత్తమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు

## టీజీ ఎంపీడీసీఎల్ ఎస్.ఈ బి. బిక్షపతి

**తాడ్వాయి ములుగు జిల్లా ఆగస్టు 6**



పిల్లల భవిష్యత్తుకు వెలుగులు నింపే అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు కల్పించడంలో టీజీ ఎంపీడీసీఎల్ కీలక పాత్ర పోషిస్తుందని ములుగు జిల్లా ఎస్.ఈ బి.బిక్షపతి అన్నారు. గురువారం తాడ్వాయి మండలంలోని ముసలమ్మ పేట అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి విద్యుత్ కనెక్షన్ ను మంజూరు చేసి, ఏర్పాటు చేయమని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఈ బిక్షపతి మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలలోని అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశానుసారం జిల్లాలోని గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడి కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాలను సర్వే చేసి విద్యుత్ కనెక్షన్లను జాగు పథకం కింద ఉచితంగా అందిస్తున్నామన్నారు. విద్యుత్ వెలుగులతో అంగన్వాడి కేంద్రాల లో ఫ్యాన్లు,లైట్లు,త్రాగునీటి మోటర్లు,పరికరాలు,సక్రమంగా పనిచేయ డంతో పిల్లలకు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించ గలుగుతుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కన్స్ట్రక్షన్ ఎ.డి సందీప్ పాటిల్.ఏ ఈ మహేందర్ రెడ్డి.ఏ ఎల్ ఎం శేషు,సతీష్,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు కొనసాగిద్దాం

## జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల బిక్షపతి



**ములుగు జిల్లా ఆగస్టు 6**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జేఏసీ అధ్యక్షుడు ముంజాల బిక్షపతి గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముంజాల భిక్షపతి గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని కృషిచేసిన మహనీయుడని, విద్యావేత్తగా అయిన ప్రజల్లో తెలంగాణ కాంక్షను మేల్కొల్పి వారికి అండగా నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని జయశంకర్ సార్ తన విద్యార్థి జీవితం నుంచే చూశారని పలు వేదికలపై తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గొంతే నినదించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శానబోయిన సాంబయ్య యాదవ్,వంశీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అశోక్, దామోదర్,బాబురావు, మోహన్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ఆగస్టు 6,**

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి అని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ లో ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతిని నిర్వహించగా ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని, ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, డి ఆర్ ఓ రవికుమార్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషిల్ వంశీ, డి.పి.ఆర్.ఓ రఫిక్,కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, సూపరింటెంట్లు మహేష్ బాబు మంజుల,శివకుమార్,కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా నూతన అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు : పద్మ ప్రసాద్



**నిజాంపేట్, ఆగస్టు 6 :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు బుధవారం ప్రకటించిన నియామకాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షులుగా గిరివర్ధన్ రెడ్డి నియమితులైన విషయం విదితమే. ఈ సందర్భంగా గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా బీజేపీ బిల్డర్ సెల్ కన్వీనర్ జి. పద్మ ప్రసాద్ అయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పద్మ ప్రసాద్ మాట్లాడుతూ, ఏబీవీపీ హోల్ టైమర్ గా, ఆర్ఎస్ఎస్ సంఘ పరివార క్షేత్రం, భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ గా, భారతీయ జనతా పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలు విజయవంతం గా గిరివర్ధన్ రెడ్డి నిర్వహించారు. పలు పదవుల్లో ఆయన పార్టీ అభివృద్ధి కి చేసిన సేవలకు గుర్తింపుగా అధిష్టానం ఆయనను జిల్లా అధ్యక్షులుగా నియమించడం సంతోషకరం అని అన్నారు. కార్యక్రమం లో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
శుక్రవారం, ఆగస్టు 7, 2026



# రెమ్యునరేషన్ లేకుండా సినిమా

సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషికాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు. కథానాయిక తమన్నా, '12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్న వారు అరుదని ప్రశంసించారు. గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.

# తెలుగు నేర్చుకోవడం చాలా కష్టం



'సవాళ్లను స్వీకరించడమంటే నాకిష్టం. కష్టతరమైనది సాధించినప్పుడు కలిగే ఆనందానికి విలువ కట్టలేం' అంటున్నారు బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఆమె మహేశ్‌బాబుకు జోడీగా రాజమౌళి 'వారణాసి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రబృందం ఓ నేషనల్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'తెలుగుభాషతో మీ ప్రయాణం ఎలా ఉంది?' అని ప్రియాంకను ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యాత అడగ్గా.. 'నాకు తెలుగు అస్సలు రాదు. నిజానికి తెలుగు భాష నేర్చుకోవడం చాలా కష్టం. మామూలుగా మాట్లాడటం ఒకెత్తయితే.. కెమెరా ముందు డైలాగ్ చెప్పడం మరో ఎత్తు. అందుకే ఈ విషయంలో రాజమౌళి హెల్ప్ తీసుకుంటున్నా. ఆయన నాకు డైలాగ్ అర్థం చెబుతారు. పాత్ర ఇన్‌టెన్షన్‌ని వివరిస్తారు. దాన్ని బట్టి ఓ పదినిమిషాలు దానిపై వర్క్ చేసి, అప్పుడు నా స్టైల్‌లో నేను డైలాగ్ చెప్తున్నా. నిజానికి అది అంత ఈజీ కాదు. అందరి సహకారం వల్లే అది సాధ్యమవుతోంది.' అంటూ సమాధానమిచ్చింది ప్రియాంక.

## పెళ్లి, విడాకులపై
# నిహారిక బ్లాస్ట్

టాలీవుడ్ నటి, కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పెళ్లి, విడాకులు, ఆ తర్వాత తన జీవితంలో జరిగిన మార్పుల గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో ఓపెన్‌గా మాట్లాడారు. నిఖిల్‌తో చేసిన ఒక పాత పాడ్ కాస్ట్‌లో తన విడాకుల గురించి చెబుతూ ఎమోషనల్ అవుతూ కనిపించారు నిహారిక.టాలీవుడ్ నటి, కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పెళ్లి, విడాకులు, ఆ తర్వాత తన జీవితంలో జరిగిన మార్పుల గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో ఓపెన్‌గా మాట్లాడారు. నిఖిల్‌తో చేసిన ఒక పాత పాడ్ కాస్ట్‌లో తన విడాకుల గురించి చెబుతూ ఎమోషనల్ అవుతూ కనిపించారు నిహారిక. ఖ౦జవతీఅంవఎవత్ ఈ ఇంటర్వ్యూలో నిహారిక తన మనసులోని బాధ బయటపెట్టారు నిహారిక. మాది పెద్దలు కుదిర్చిన పెళ్లి. కొన్ని కారణాలతో మ్యారేజ్ తర్వాత విడాకులు తీసుకున్నాం. బయట వాళ్ళు దీనిపై ఎన్నో రకాలుగా మాట్లాడుకుంటారు. ఎంతో గ్రాండ్‌గా పెళ్లి చేసుకుని, డివోర్స్ తీసుకున్నారు అంటారు కానీ, నిజంగా ఆ నొప్పి ఎలాంటిదనేది అనుభవించిన వాళ్లకు మాత్రమే తెలుస్తుంది అని నిహారిక అన్నారు. పెళ్లి అనేది ప్రతి వ్యక్తి జీవితంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అయినప్పటికీ, ప్రతి విషయం మనం ఊహించినట్లుగా జరగకపోవచ్చని నిహారిక అన్నారు. వివాహ బంధం ముగిసిన సమయంలో తాను చాలా కష్టాలు, సూటిపోటి మాటలు ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. నా క్యారెక్టర్ తప్పుబట్టారు, కుటుంబాన్ని దూషించారు.. పెళ్లి, విడాకులు అనేది నా జీవితంలో ఓ గుణపాఠం లాంటిది అని నిహారిక చెప్పారు. ఆ దశలో మానసికంగా బలంగా నిలబడటం సులభం కాదని, కానీ సమయం గడిచే కొద్దీ పరిస్థితులను అంగీకరించడం నేర్చుకున్నానని అన్నారు నిహారిక. అయితే పెళ్లి చేసుకునే ముందే ఒకరి గురించి ఇంకొకరు తెలుసుకోవడం చాలా అవసరమని చెప్పారు. అందరూ మన అమ్మానాన్నల్లా ప్రేమగా చూసుకోలేరుగా అని ఆమె చెప్పడం చూస్తుంటే.. నిహారిక విడాకులకు ఏదో బలమైన కారణమే ఉందని అర్థమవుతోంది.ఆ సమయంలో తనకు కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతు ఎంతో ఉందని నిహారిక పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు మనల్ని మరింత బలంగా మార్చుతాయని, ఆ అనుభవాలు తనలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని ఆమె చెప్పారు. ప్రస్తుతం తాను పూర్తిగా కెరీర్‌పై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నానని తెలిపారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా కొత్త ప్రాజెక్ట్‌లపై పని చేస్తున్నట్టు చెప్పారు. ప్రేక్షకుల ప్రేమ మరియు మద్దతు తనకు ఎప్పుడూ ప్రేరణగా ఉంటుందని ఆమె అన్నారు.

# మా అమ్మకు మళ్లీ పెళ్లి చేయాలనుంది..
## సుప్రీత ఎమోషనల్ కామెంట్స్ వైరల్



టాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13న విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో సుప్రీత మాట్లాడుతూ తన తల్లి సురేఖా వాణికి మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడించింది. "రీసెంట్‌గా ఈ విషయం అమ్మతో చెప్పాను. కానీ ఆమె మాత్రం నాన్న జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోంది. ఆ ప్లేస్‌లోకి వేరే ఎవరినీ రానివ్వకూడదని భావిస్తోంది. అదే సమాధానం నాకు చెప్పింది" అని సుప్రీత తెలిపింది. అయితే తాను పెళ్లి చేసుకునేలోపు అయినా అమ్మకు మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందని కోరుకుంటున్నానని చెప్పింది. "మా అమ్మను బాగా చూసుకునే వ్యక్తి రావాలి. ఆమె చాలా హ్యాపీగా ఉండాలి. ఆమె కోరుకున్నది ఇవ్వాలి. ఆమె స్పేస్‌ను గౌరవించాలి" అంటూ భావోద్వేగంగా స్పందించింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతో కూడా చర్చించామని, వారు కూడా ఓకే అన్నారని తెలిపింది. సురేఖా వాణి కెరీర్ గురించి కూడా సుప్రీత మాట్లాడింది. ఒకప్పుడు తన తల్లి ఎంతో బిజీ ఆర్టిస్ట్ అని, ఇప్పుడు మాత్రం అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంది. మేకప్ వేసుకుని ఏడాదిన్నర దాటిపోయింది. సినిమాల్లో నటించాలని అమ్మకు ఇంకా ఆసక్తి ఉంది. కానీ అవకాశాలు రావడం లేదు అని ఫీల్ అవుతోంది. కనీసం ఒక మంచి పాత్ర వచ్చినా చేయాలని ఉందని చెబుతోంది అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక సుప్రీత హీరోయిన్‌గా పరిచయం అవుతున్న 'అమరావతికి ఆహ్వానం' చిత్రం హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కింది. ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, శివకంఠనేని కీలక పాత్రల్లో నటించారు. జీవీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో మిస్టరీ, క్షుద్రపూజలు, మూఢనమ్మకాల అంశాలతో కథ నడుస్తున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాతో సుప్రీత ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి.